శ్రీరామకోటి వ్రాసుకుంటున్న వెంకట్రామయ్య వీధి గేటు కిర్రున చప్పుడు కావడంతో యాదాలాపంగా తలెత్తి చూశారు.

మనవడు ప్రకాశం పుస్తకాల సంచీతో వస్తూ కన్పించాడు. అప్రయత్నంగా ఆయన ఇంటిలోకి చూశారు.

గోడ గడియారం పది గంటల ఇరవై అయిదు నిముషాలు సూచిస్తోంది. ప్రకాశం బడి నుండి




తిరిగి వచ్చే సమయం మధ్యాహ్నం ఒంటిగంటన్నరకి.

అరగంట క్రితమే వాడు బడికి వెళ్ళాడు.

"ఏంరా, ప్రకాశం! బడికి పోలేదేమిటి?"

బరువైన పుస్తకాల సంచీ వరండాలో పడేస్తూ హుషారుగా చెప్పాడు వాడు— "వెళ్ళాను, తాతయ్యా! కానీ, బడికి సెలవులిచ్చారు ఇవాళ్టి నుండి."

"ఎందుకని?"

"అదేమో నాకేం తెలీదు, తాతయ్యా! మా మేస్టర్లంతా వూరేగింపు చేస్తారట. బడికి తాళం వేసేసి, మమ్మల్ని ఇళ్ళకి పొమ్మన్నారు. . ."

వెంకట్రామయ్యగారు మరో ప్రశ్న అడగబోయే సరికి వాడు ఇంట్లోకి పారిపోయాడు తుర్రుమని.

ఆయన మనవడు వదిలేసిన పుస్తకాల సంచీకేసి చూశారు.

సంచీ నిండుగా రకరకాల పుస్తకాలు.

ప్రకాశం ఆరో తరగతి కుర్రాడు.

పట్టుమని పదేళ్ళు లేని కుర్రనాగన్న. వాడి వయసుకి మించిన భారం పుస్తకాల సంచీ.

స్వతంత్రం వచ్చిన పిదప విద్యావిధానం మారిపోయింది. సంవత్సరాని కో కొత్త సిలబస్ ప్రవేశ పెడుతూ రోజురోజుకీ పుస్తకాల సంఖ్య పెంచేస్తున్నారు.

ఇన్ని పుస్తకాలు వీడి కెన్ని జీవిత సత్యాలను నేర్పగలవో పరమాత్ముడి కెరుక. వెంకట్రామయ్యగారు రామకోటి వైపు మనస్సు మళ్ళించబోయాడు.

మళ్ళీ గేటు చప్పుడు కిర్రుమంటూ.

ఈమారు మనవరాలు—స్వరాజ్యలక్ష్మి.

తాతయ్య చూపులో ప్రశ్న గ్రహించినదానిలా గలగల జవాబు చెప్పింది.

"ఈ రోజు నుండి రాష్ట్రమంతటా సమ్మె చేస్తున్నారు, తాతయ్యా! సమ్మె ముగిసేవరకూ మమ్మల్నెవర్నీ బడికి రావద్దని మేడమ్ చెప్పారు."

స్వరాజ్యం పదవ తరగతి చదువుతోంది బాలికల పాఠశాలలో.

సమ్మె అనగానే వెంకట్రామయ్యగారి మొహంలో బాధ గోచరించింది.

"మొన్ననేగా సమ్మె ముగిసింది! మళ్ళీ ఇంతలో ఇంకేం ముంచుకొచ్చిందమ్మా?"

స్వరాజ్యం నవ్వుతూ చెప్పింది. "అది అధిక ధరలకు నిరసనగా చేసిన సమ్మె, తాతయ్యా! ఇప్పుడు మన రాష్ట్రంలో పట్వారీలను వెనువెంటనే రాష్ట్రం విడిచిపొమ్మని సమ్మె చేస్తున్నాం."

వెంకట్రామయ్యగారు అయోమయంగా చూశారు.

"వాళ్ళేం తప్పు చేశారమ్మా?"

"అదేమో? అవన్నీ నాకు తెలియవు, తాతయ్యా!" అంటూనే వంటింట్లోకి నడిచింది తల్లివద్దకు.

వెంకట్రామయ్యగారి మనస్సు గతాన్ని త్రవ్వు కుంటోంది.

పరజాతీయుల పరిపాలనకు నిరసనగా, మహాత్ము డిచ్చిన పిలుపునందుకుని దేశమాత దాస్యశృంఖలాలు తెగ్గొట్టేందుకు ఆసేతు హిమాచలమూ, ఆబాల గోపాలమూ ఉప్పెనలా కదిలారు.

మహాత్ముని ఆయుధం శత్రువులపాలిటి అతి భయంకరమైంది.

దాని పేరు సత్యాగ్రహం! !

అహింసాయుతమైన, అతి శక్తివంతమైన వజ్రాయుధ మది.

దాని తాకిడికి తట్టుకోలేని తెల్లవారు ఎన్నెన్నో కుతంత్రాలు పన్నినా—చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠితమైన దీక్షతో ఒకే మాటగా ఒక త్రాటిపై నిల్చి ఎదుర్కొన్నారు తామంతా.

అది త్యాగనిరతికి పరాకాష్ఠ.

సంఘటిత ప్రజా శక్తికి మచ్చుతునక.

అది మహా యజ్ఞం.

జాతి మతాలకు, రాష్ట్ర, భాషా భేదాలకు అతీతంగా, అజేయంగా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగ్గ మధుర ఘట్టం.

చివరికి తెల్లవారు తలొగ్గక తప్పలేదు.

"నా దేశం స్వతంత్రవాయువులు పీల్చుకునేందుకు నా చివరి రక్తపు బిందువు ధారబోస్తాను" అన్న మహనీయు లెందరి రుధిరమో కురిస్తే, వారి ఆత్మార్పణకు బదులుగా లభించిన యజ్ఞ ఫల మిది.

స్వతంత్రం వచ్చింది తాము కోరుకున్నవిధంగా,

వెంకట్రామయ్యగారికి తన వెనుకటి జీవితం గుర్తొచ్చింది. పోలీసుల చేతిలో తను తిన్న లాఠీ దెబ్బల గుర్తులు ఇంకా ఉన్నాయి.

ఎన్నిసార్లు తను జైలు శిక్ష అనుభవించిందీ గుర్తు లేదు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు వాత్సల్యంతో తనలాటి యువకు లందరినీ స్పృశిస్తూనే నొప్పి,బాధ మటుమాయమయ్యేవి.

ఉత్సాహం ఇనుమడించి ద్విగుణీకృతమై త్రికరణ శుద్ధిగా తాము ఆ మహాశాంతి సమరంలో పాల్గొనే వారు.

ఎంత చక్కని రోజులు!

ఎంత త్వరగా కరిగి పోయాయి!

మళ్ళీ గేటు చప్పుడయింది.

వెంకట్రామయ్యగారి ఆలోచనలు తెగిపోయాయి.

ఈ మారు తన కొడుకు బాలగంగాధరతిలక్! తన స్నేహితులకి వీడ్కోలు చెబుతూనే గేటు తలుపు వేసి నెమ్మదిగా వస్తున్నాడు.

కన్నేపల్లి చలమయ్య శాస్త్రి




ఉస్సురని శిట్మూర్తి వరండాలో కూలబడ్డాడు.

ఒక్క నిమిషం పాటు ఊపిరి పీల్చుకుని నీరసంగా చెప్పుకొచ్చాడు.

"దేశం తగలబడి పోతూంది, నాన్నగారూ! మొన్నటి స్ట్రయిక్ పీరియడ్ గొడవ ఇంకా తేలక ముందే మా ఉద్యోగస్థుల పాలిటి మరో స్ట్రయిక్ దాపురించింది."

"అవును, విన్నాను. పిల్లలు బడి నుండి తిరిగి వచ్చేశారు ఇప్పుడే. బోస్‌బాబు మాత్రం కాలేజీ నుండి రాలేదింకా."

"మనం ఎటు పరుగులు తీస్తున్నామో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది, నాన్నగారూ! సమ్మెలంటూ, బంద్ లంటూ మాన్ అవర్స్‌ని చేతులారా నాశనం చేసుకుంటున్నాం. ఈ ఒక్క సంవత్సరంలో ఇప్పటికే మూడు సార్లు సమ్మెల్లో పాల్గొనాల్సి వచ్చింది. ఇది నాలుగోది."

"స్వరాజ్యం చెప్పింది. పట్వారీలను రాష్ట్రం ఖాళీ చేయమంటూ ఉద్యమం లేవదీశారట కదా?"

"అవును."

"వాళ్ళు చేసిన తప్పేమిట్రా, తిలక్? తెల్లవారిని ఈ దేశం విడిచి పెట్టమని అప్పటి మహాత్ములు తలపెట్టిన ఉద్యమానికో అర్థమూ, ప్రయోజనమూ ఉండేది. కానీ, ఇది?"

"అర్థంకాని అంటురోగం, నాన్నగారూ! ఇప్పటి తరంలో బ్రతుకు పట్ల అవగాహన తక్కువ. నిదానంగా ఆలోచించే ఓపిక నశించింది. ఈ రోజు మీరు రాష్ట్రాలమధ్య వైషమ్యాన్ని చూస్తున్నట్టే... రేపు మేము జిల్లాల విభేదాలు చూడక తప్పదేమో?"

"ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలే దేమిట్రా? సీతా రాముడు ఏం చేస్తున్నట్టు?"

తిలక్ ఫకాలున నవ్వాడు.

"సీతారాము డేమిటి, నాన్నగారూ? ఆయ నిప్పుడు ఎమ్మెల్యే సీతారామ్మూర్తిగారు. రేపో, మాపో మంత్రి అయినా ఆశ్చర్యం లేదు. ఎక్కడెక్కడి ప్రారంభోత్సవాల లోనూ, శంఖు స్థాపనల లోనూ తీరిక లేకుండా తిరుగుతున్నారు."

"ఏమిటీ సీతారాముడు అంత బాధ్యత లేని మనిషిగా తయారయ్యాడా! ఆ రోజుల్లో అతి చిన్న వయస్సులోనే మాతో పాటు జైలు శిక్ష అనుభవించిన సీతారాముడిని చూస్తుంటే జాలి వేసేది మాకు. ఎంత ఉద్రేకంగా మాట్లాడే వాడు. శక్తి ఉడిగిన మేము—మా ఆశలన్నీ వాడి ద్వారా ఫలిస్తా యని సంతోషించే వాళ్ళం."

"అవన్నీ కరిగిపోయిన మధుర స్వప్నాలు, నాన్నగారూ! ఇప్పు డీ దేశంలో స్వార్థ ప్రభంజనం వీస్తోంది. ఏ ఎండ కా గొడుగు పట్టడమే ఇప్పటి రాజనీతి. సీతా రామ్మూర్తిగారు ఈ కాలపు లౌక్యాన్ని ఔపోసన పట్టిన రాజకీయవేత్త!"

"ఛీ ఛీ, ఏం పాడు రోజు లొచ్చి పడ్డాయిరా, తిలక్!"

వెంకట్రామయ్యగారు వాపోయారు.

తిలక్ శూన్యంలోకి చూస్తున్నాడు.

● ● ●

భోజనం చేయగానే నడుం వాల్చే వయస్సు వెంకట్రామయ్యగారిది.

ఆయన నిద్ర విరిగి పోయింది, దగ్గర్లో బిగ్గరగా కేకలు వినిపించడంతో—

"పట్వారీలు డౌన్ డౌన్."

"పర రాష్ట్రీయులు ముర్దాబాద్."

"ఇంక్విలాబ్ జిందాబాద్."

"తక్షణం మా రాష్ట్రం విడిచి వెళ్ళండి."

చొక్కా బొత్తాలు లేని బడిపిల్లలు వీధి మొగలో గొంతు లేస్తున్నారు. వెంకట్రామయ్యగారు పరిశీలనగా చూస్తున్నారు వాళ్ళని.

ఇంత చిన్న పిల్లల్లో ఎంత భయంకరమైన విషబీజం నాటుకుంది.

వీళ్ళతోపాటు పెరిగి అది మహా వృక్షమై ఆ దీ దేశాన్ని ఎంతగా దిగజార్చ నున్నదీ ఊహించు కుంటేనే కంపర మెత్తింది.

అది వాళ్ళ పాలిటి వినోదం.

తను పిచ్చి కేకలు ఆ పసి హృదయాలకు అర్థం కానంత వరకూ బాధ లేదు. అర్థమయిందంటే?

ప్రకాశం ఇంట్లోంచి తుర్రున పరుగు తీశాడు వీధిలోకి.

"ఒరేయ్..ఒరేయ్, ప్రకాశం ..."

వెంకట్రామయ్యగారి కేకలు వినిపించుకోలేదు వాడు.

ప్రకాశాన్ని చూస్తూనే గోలగా కుర్రాళ్ళంతా మరోసారి అరిచారు శక్తికొద్దీ.

"ఇంక్విలాబ్ జిందాబాద్ ..."

"పట్వారీలు ముర్దాబాద్ ..."

ప్రకాశం అగ్గిపుల్లగీసి కుప్పకి అంటించాడు. చిన్నగా ప్రారంభమైన మంట కొద్ది సేపటికే వేగం పుంజుకుంది.

పిల్లలు కేరింతలు కొడుతూ తిరుగుతున్నారు మంట చుట్టూ.

వెంకట్రామయ్యగారి మనస్సు కుత కుతలాడింది. ప్రకాశం!!

ఎంత చక్కని పేరు వాడిది. ఏరి కోరి ఆంధ్ర కేసరి పేరు పెట్టించాడు తను.


తుపాకీ గుండుకు గుండె నొడ్డిన ఆ మహానుభావుడి పేరు ధ్వంసం చేసి భస్మాసురులు పుట్టుకొచ్చారు.

"ఆపం డర్రా" శక్తికొలదీ కేకవేశారు.

పిల్లలంతా హడలిపోయి తలో దిక్కూ పరి గెత్తారు.

వెంకట్రామయ్యగారికి ఇరవై ఏళ్ళ క్రితం ఆ ఘోరి పరిస్థితి యాదృచ్ఛికంగా గుర్తొచ్చింది.

● ● ● ●




ప్రకాశం సైగ చేశాడు వాళ్ళని ఆపమన్నట్టు. వాళ్ళంతా ఆగారు.

ప్రకాశం కాలరు సర్దుకుని చెప్తున్నాడు రాజ కీయ వేత్తలా.

"సోదరులారా! మనమంతా ఈ నేల తల్లి పిల్లలం. మన నేలలో మరో పిచ్చి మొక్క మొల కెత్తితే మనం సహించ కూడదు. సహించకూడ దంటే ఏం చెయ్యాలి మనం?!"

క్షణం ఆపాడు ప్రకాశం.

"బస్సులు తగులబెట్టాలి."

"బల్బులు బద్దలు కొట్టాలి."

"పట్వారీలను వెళ్ళగొట్టాలి."

"ఫాక్టరీలను ధ్వంసం చెయ్యాలి."

గుంపులోనుండి అరుపులు.

"సెభాష్. మనం ఫాక్టరీని తగులబెట్టబో తున్నాం ఇప్పుడు!!"

పిల్లలంతా సంతోషంతో చప్పట్లు చరిచారు.

చిట్టిగాడు, భాస్కరం రోడ్డు మీద చిందర వందరగా పడ్డ కాగితాలను, చెత్తను ఒక ప్రక్కగా కుప్ప వేశారు.

గణేష్ పట్వారీ దగ్గర కావల్సినంత డబ్బుంది. అతని స్నేహితుడు మనోహర్ జైన్ మెదడులో పుష్కలమైన తెలివితేట లున్నాయి. వాళ్ళిద్దరూ స్నేహితులే కాక పార్ట్‌నర్స్.

తమ డబ్బుని, మేధస్సుని సద్వినియోగం చేసే పథకాలని వేసుకొంటూ దేశ సంచారం చేస్తున్న వాళ్ళ కీ వూరు నచ్చింది.

ఫాక్టరీ నిర్మాణానికి కావలసిన వనరులు వసతులన్నీ ఉన్నాయి.

వెను దిరిగి చూడాల్సిన అవసరం లేదు.

పథకాన్ని వెంటనే అమలులో పెట్టారు.

ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వడంతోపాటు, సబ్సిడీ మంజూరు చేసింది.

కొండల దిగువ ఫాక్టరీ గొట్టాలు లేచాయి.

ఈ లోగా పట్వారీ ప్రకటనల వలన ప్రజల్లో కమర్షియల్ క్రాప్ పట్ల ఉత్సుకత కలిగింది.

పట్వారీ—ఎగ్రికల్చరల్ లోన్స్ ఇస్తున్నాడు.

శ్రమకు తగినంత ఫలితం దక్కడంతో పోటీలు పడి చెరకు తోటలు పెంపకం కొనసాగించారు.

మొదటిసారిగా ఫాక్టరీ చైతన్యంలోకి తొంగి

చూసింది. ఫాక్టరీ గొట్టాలు పొగ వెదజిమ్మాయి ఆకసంలోకి.

ఫాక్టరీని జాతికి అంకితం చేస్తూ ఒక మహా నాయకుడు,—''నేటి ప్రగతికి, అభ్యుదయానికి ఇటువంటి ఫాక్టరీలే మందిరాలు'' అని అభివర్ణించాడు.

మొదటి సంవత్సరమే చెప్పుకో దగ్గ క్రషింగ్ జరిగి, ఉత్పత్తి ప్రోత్సాహకరంగా కనిపించే సరికి పట్వారీ జర్మనీ నుండి మోడరన్ మెషనరీ తెప్పించాడు.

ప్రాంతీయ నిరుద్యోగులకి ఉద్యోగావకాశాలు పెరిగాయి.

పదినెలల ఎమెర్జెన్సీ ట్రెయినింగ్ ఇవ్వబడింది. పనిలో మెలకువలు నేర్చుకున్నారు.

ప్రాంతీయుల కలలు పండాయి.

ఇటు తాము ఆ ఫాక్టరీకి ముడి సరుకు నదించే కర్షక వీరులు. అటు తమ పిల్లలు యంత్రాలను శాసించే కర్మవీరులు.

రోజులు ప్రశాంతంగా సాగిపోతున్నాయి.

ఫాక్టరీతోపాటు పట్వారీ తలపెట్టిన మోడరన్ టవున్‌షిప్ పూర్తయింది.

ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, కమ్యూనిటీ సెంటర్, ఫిల్మ్ క్లబ్, చిల్డ్రెన్స్ పార్క్, హాస్పిటల్, మార్కెట్ కాంప్లెక్స్, మిల్క్ చిల్లింగ్ సెంటర్ — ఒక్కొక్కటిగా చోటు చేసుకున్నాయి.

రెండు మూడేళ్ళలో మరెన్నో అనుబంధ ఫాక్టరీలు వెలకొన్నాయి.

ప్రభుత్వం పూనుకొని డిగ్రీ కాలేజీ స్థాపించింది.

ఇప్పుడా పట్టణం జిల్లాకే కాక, రాష్ట్రానికే గర్వకారణ మయింది.

రోజు రోజుకీ కొత్త మెరుగులు దిద్దుకుంటూ పట్టణం అగ్రగామిగా నిల్చింది.

రాజకీయ పక్షాల దృష్టి ఆ పట్టణంపైన పడింది.

అక్కడ ప్రాబల్యం పొందిన వర్గానికి మూడు అసెంబ్లీ సీట్లు, ఒక పార్లమెంట్ సీటు గారంటీ అన్న భావన బలపడటంతో వివిధ పక్షాల మధ్య పోటీ ప్రారంభ మయింది.

రంగు రంగుల జెండాలు, రకరకాల పార్టీ కార్యాలయాలు వెలకొన్నాయి.

రెండు ఔట్ పోలీస్ స్టేషన్లు కూడా తల ఎత్తాయి.

ఇప్పుడా పట్టణానికి రాజధానికి కలుపుతూ స్పెషల్ బస్సులు పడ్డాయి. ఇదంతా ఎవరి చలువ?

● ● ●

వెంకట్రామయ్యని చూస్తూనే రామానుజంగారు సాదరంగా ఆహ్వానించారు.

ఇద్దరూ సమ వయస్కులు.

ఇరువురివీ ఏకాభిప్రాయాలు.

స్వతంత్ర పోరాటంలో ఇద్దరూ కలిసి పని చేశారు. కలిసి అజ్ఞాతవాసంలో గడిపారు.

స్వతంత్రం వచ్చిన తొలి రోజుల్లో రామానుజం రాజకీయాల్లో తల దూర్చి, ఒక పర్యాయం శాసన సభ్యుడుగా ఎన్నికయ్యారు.

కానీ, స్వార్థపు ముసుగులో ప్రజల మనుగడ మీద జూదమాడుకునే అధునాతన రాజకీయాల విపరీత ధోరణి అతనికి నచ్చలేదు.

రాజకీయాలనుండి విరమించుకుని తన చివరి మజిలీ వైపు ఏకాకిగా, స్థిరంగా ప్రయాణం చేస్తున్నా డతను.

'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అనె దృఢాభిప్రాయంతో, నిక్షిప్తమైన గతాన్ని త్రవ్వుకుంటూ ఆ నెమరువేతలో రోజులు దొర్లిస్తున్నాడు.

''ఏంటోయ్, వెంకట్రామయ్యా! అమాంతం వూడి పడ్డావు. త్రోవ తప్పి నట్టున్నావు.'' అన్నాడు తమాషాగా.

''త్రోవ వెతుక్కుంటునే వచ్చాను, రామానుజం! యుగాంతం సమీపిస్తూంది. స్వార్థం విశ్వం విడిగా నర్తిస్తూ ప్రజల్లో చైతన్యం శూన్యమవుతూంది. అందుకే నా ఆవేదన.''

అతని భావాలను పసి కట్టినట్టు నిర్వికారంగా సమాధాన మిచ్చాడు రామానుజం.

''పెరుగుట విరుగుట కొరకే అన్న ఆర్యోక్తి

## ఇష్టపదులు

**కలలు,** కన్నీళ్ళు
కార్లు, షికార్లు, కౌగిళ్ళు
గుండె పగుళ్ళు, నరాల నీలుగుళ్ళు
పునస్సమాగ సంరంభ పందిళ్ళు
ఇప్పుడు—
ఇవీ అవీ అని లేదు హద్దు
కథనానికి యోచన లేమిటి లెద్దు
దానికి మరి ప్రయోజనమేదీ చెప్పొద్దు
అభ్యుదయ తెరచాప లసలే ఎత్తొద్దు
ఏవో ఇన్ని కాగితాలపై
సిరాతో అద్దు
ఈనాటి నవల కదే
సిసలైన సరిహద్దు.
అందుకే—
రాసులు రాసులు పేరుస్తూ
నవరసాల మసాలా కలిపేస్తూ
నట్టింట పాఠకుల కళ్ళు నత్తిస్తూ
కాసుల గలగలలు వినిపిస్తూ
అయ్యయ్యో—
సంపాదకులూ
చిత్ర నిర్మాతలూ
సాహితీ వ్యాపారపారీణులూ
బహుమతి ప్రదాన నిర్ణయ ధురీణులూ
పిల్చింకా రారేం
బల్చింకా తేరేం
ఈ వ్రాత కట్టలన్నీ ఎత్తించాలి
పాలరాతి మేడకు పన్నీరు జల్లించాలి.

—డా. పి. వి. రమణ

గుర్తు చేసుకోవాలోయ్ మనం. నీ బాధ అర్థమయింది నాకు. కానీ, మనం రంగు వెలసిన బొమ్మలం. మన ఆశయాలను గానీ, ఆదర్శాలను గానీ ఈ తరం మన్నించదు. అందుచేత మన పాత్రలు ఈ నాటక రంగాన పరిసమాప్తి నొందే శుభ ఘడియ కోసం ఎదురు చూడడం మినహాయించి మన చేతిలో ఏముందని?'' అన్నాడు వేదాంత ధోరణిలో.

''రామానుజం! మనం ఒకప్పటి ఉద్యమ నాయకులం. నిస్వార్థంగా కృషిచేసి మనం పండించిన పంటను మన బిడ్డలు తెలివి తక్కువగా తగుల బెడుతుంటే చూస్తూ మౌనం వహించడం మంచి దంటావా? వాళ్ళ తప్పు దిద్ది సన్మార్గంలో పెట్టే బాధ్యత మన మీద లేదా?''

రామానుజంగారు కించిత్తు ఆలోచనలో పడ్డారు. తరవాత నెమ్మదిగా చెప్పారు.

''ఈ తరంలో మనం వూహించని వేగం చోటు చేసుకుంది. బ్రతుకు పోటీ బలపడింది. భవిష్యత్తు ఆందోళనా పూరితంగా కనిపిస్తూంది. రేపటి యుద్ధానికి ఈ రోజే సమాయత్త మవుతున్నారు. ఇదో రకం చైతన్యం. ఈ తరం వాళ్ళెన్నుకున్న మార్గం ఇదే మరి.''

''కానీ మహాత్ముడు...''

''పుస్తకాల చివరి పేజీలో శిథిల మవుతున్నాడు. కాకపోతే మన తరం గుండెలో ఇంకా చిరంజీవిగా కదులుతున్నాడు. కానీ, ఇంకెంత కాలం?''

''అంతేనంటావా?''

''అంతే మరి!''

''అస లింతకీ ఈ మకుటం ఎక్కడ పుట్టింది? ఎందుకు పుట్టింది?'' అడిగాడు జిజ్ఞాసంగా.

రామానుజం ప్రారంభించాడు నెమ్మదిగా.

● ● ●

స్వాతంత్రం వచ్చిన పిదప అధికార పిపాస పెరిగింది రాజకీయ నాయకుల్లో.

వర్గ పోరాటాలు, గుత్తాధిపత్యాలు ప్రారంభ మయ్యాయి.

రోజుకో పార్టీ అవతరిస్తూంది. అనిశ్చిత స్థితి అంకురించింది.

దీనికి తగ్గట్టు ప్రజలపై పన్నుల భారం పడింది.

సామాన్యుడి జీవితం అస్తవ్యస్తమైంది.

నిత్యావసర వస్తువులు చీకటి బజార్లో దాగున్నాయి. వినియోగదారుడిలో అసంతృప్తి రగిలింది.

దానా దీనా ఎటు చూసినా అభద్రతారాహిత్య భావం ప్రబలింది. ఎన్నికలొచ్చాయి కోలాహలంగా.

ప్రాబల్యం పొందిన ఒక రాజకీయ పక్షం బాహాటంగానే ఎన్నికల నిధి సేకరణకు పూనుకుంది.

అడగడంలో పరిమితి లేదు, అభ్యర్థన లేదు.

పొగరుబోతు దున్నల్లా దేశం మీద పడ్డారు.

పట్వారీలు కూడబలుక్కుని కార్యకర్తకి తామెంత ఈయనున్నదీ వివరించారు. అది వింటూనే కార్యకర్త ఉరిమి చూశాడు.

''మే మేం మిమ్మల్ని ముష్టి అడక్కోడానికి రాలేదు పట్వారీజీ! దేశం ఎటువంటి విపత్కర పరిస్థితి నెదుర్కొంటున్నదీ మీకు తెలుసు. ఈ ఎన్నికల్లో మన పక్షం నెగ్గకుంటే మీ వర్గం ఏ

నుడి గుండంలో చిక్కుకున్నదో మీరు ఊహించగలరు. మీ కోసం అహర్నిశలూ శ్రమిస్తూ, మీ అభివృద్ధికై సదా పాటు పడుతున్న మన పక్షానికి మీరు కట్టిన విలువ ఇంతేనా? మరో మారు నిశితంగా ఆలోచించండి

అంటూ చిందులు తొక్కాడు.

ఇదంతా వింటున్న ప్రమోద్ పట్వారీకి కోపం ముంచుకొచ్చింది.

ఒడిదుడుకు లెరుగని ఉడుకు రక్తం అతనిది. అదీకాక దేశంలో రాజకీయ పరిస్థితి అయోమయంగా ఉంది. ఎవరు అధికారం లోకి వస్తారో అంచనా కందదు.

దానికి తగ్గట్టు ఈ పెత్తందారీతనం!

అందుకే ఆవేశంలో మాట విసిరాడు. "ఏం? ఎందుకు మేం విరాళా లివ్వాలి? మా ఆర్థిక సహాయం లేకుంటే మీ పక్షం ఎన్నికల్లో నెగ్గలేదా? ప్రజల అభిమానాన్ని డబ్బుతో కొందామనుకుంటున్న మీ పక్షం బలహీన వర్గాల నెలా ఉద్ధరించగ లదు? మిగిలిన పక్షాల్లా మీరు మాత్రం ఎందుకు పోటీ పడ కూడదు? ఏ పక్షానికైనా మే మెందుకని విరాళా లివ్వాలి?"

కార్యకర్త వజవజ లాడాడు కోపంతో. అతని కళ్ళు అగ్ని కణాల్లా భగభగ మండాయి.

"మీ మూర్ఖత్వాన్ని మీరే బయట పెట్టు కుంటున్నారు. పశ్చాత్తాప పడే రోజు దగ్గరలోనే ఉంది" అంటూ విసురుగా బయట పడ్డాడు.

గనేశ్ పట్వారీకి భవిష్యత్తు ఆందోళన కరంగా కనిపించింది.

కాని, మిగిలిన పట్వారీలు ప్రమోద్‌ను మెచ్చు కోలుగా చూస్తున్నారు.

"నువ్వు చెబుతున్నదానికీ, ప్రస్తుత ఉద్యమానికీ పొంతన కుదరడం లేదు. ఇది స్వతంత్ర భారతదేశం. ఈ దేశంలో అందరికీ ఒకేలా స్వేచ్ఛావకాశాలు కల్పించబడ్డాయి. రాజ్యాంగం ప్రకారం ఈ చిన్న సంఘటన అతి భయంకరమైన ఉద్యమానికి ఎలా దారి తీసిందో అర్థం కావడం లేదు" అన్నారు వెంకట్రామయ్యగారు.

రామానుజంగారు జాలిగా చూశారు.

గట్టిగా వూపిరి పీల్చుకుని, ఆ వెనుక జరిగిన ఘట్టాన్ని వివరించారు నింపాదిగా.

• • •

ఎన్నికల కోలాహలం ఆరాయించుకోలేని సామాన్యుడిపట్ల ప్రకృతి పొదిగిన మరో శాపం—అనావృష్టి.

సకాలంలో వర్షాలు పడనందున హరితం హరించుకపోయింది పంట పొలాలలో.

గ్రీష్మఋతువు బలం పుంజుకుంది.

మహావృక్షాలు కూడా నిలువునా మాడిపోతూ, పశుపక్ష్యాదులకు గ్రాసం లేక, మనుష్యులకి తాగేందుకు గుక్కెడు నీరు దొరకని పరిస్థితి ఎదురైంది.

నేల పగులు వారింది దయనీయంగా.

దుర్భరమైన కరువు, కాటకాలు విలయ తాండవం చేస్తూ రాష్ట్రంలో ఒక ప్రాంతం అనావృష్టికి గురయింది.

వారి సహాయార్థం మిగిలిన ప్రాంతాల్లో నిధి సేకరణ మొదలయింది. ప్రమోద్ పట్వారీ దుకాణం ముందు సేకరణ బృందం ఆగింది.

"కరువు బాధితుల సహాయార్థం నిధి సేకరణకు బయల్దేరాం. మీ చందా అయిదు వేల రూపాయలుగా నిర్ధారించాం. . ." అన్నాడు బృందనాయకుడు, ఏ ఉపోద్ఘాతమూ లేకుండగనే.

ప్రమోద్ పట్వారీ ఉలిక్కిపడ్డాడు.

"అయిదు వేలా!?"

"అవును. ఇవ్వలేనని తప్పించుకోవడం మంచిది కాదు. మీ స్తోమతను అంచనా కట్టి మేమే మీ వాటా నిర్ణయించాం. ఇది ఏ ఒక్కరి స్వార్థానికో కాదు. తోటి ప్రజల కన్నీటిని తుడిచేందుకే వినియోగించబడుతుంది."

"కానీ, అయిదువేలు పెద్ద మొత్తం!"

"నాన్నారంటే పరిస్థితి విషమిస్తుంది, దయచేసి వెంటనే డబ్బు పడెయ్యండి. ఇన్నాళ్ళూ మమ్మల్ని మీరు దోచుకుతిన్నారు. మీరు తిన్నదానిలో అతి కొద్ది మొత్తం మాత్రమే మిమ్మల్ని అడుగు తున్నాం. ఇచ్చెయ్యండి. . ."

ఆ మాటల్లో వ్యంగ్యానికి, దౌర్జన్యానికీ ప్రమోద్ ఒళ్ళు మండింది. తమాయించుకుంటూనే అడిగాడు—"ఇవ్వకపోతే—?!"

బృందనాయకుడు చివాల్న వెనక్కు తిరిగి ఏదో సైగ చేశాడు. చెలియలి కట్ట దాటిన సాగర తరంగాల్లా గుంపు దుకాణంలో చొరబడ్డారు.

కాష్ బాక్స్ ఎవరో బలంగా గుంజారు. ప్రమోద్ అడ్డుకోబోయాడు. అతని తలమీద బలమైన దెబ్బ పడింది. కళ్ళముందు వెలుగు వలయం!

ప్రమోద్ స్పృహ కోల్పోయాడు.

ఎవరికి తోచింది వాళ్ళు దోచుకుంటున్నారు.

షో కేస్ అద్దాలు భళ్ళుమని విరక్కొట్టి, దుకాణాన్ని చిందరవందర చేస్తూ—

రెండు నిముషాలలోనే—ఆ దుకాణం రుద్ర భూమిలా మారిపోయింది. ప్రక్క దుకాణాలవాళ్ళు ఎప్పుడో షట్టర్లు దించేసుకున్నారు.

ఎవరో ఫోన్ చేయడంతో పోలీస్ వాన్ సైరన్ మ్రోగించుకుంటూ వచ్చింది పదిహేను నిమిషాల తర్వాత.

ఇనుప బూట్లు టకటకలాడించుకుంటూ దుకాణంకేసి పరిగెత్తారు పోలీసులు. అప్పటికే ఆ ప్రదేశం నిర్మానుష్య మయింది.

• • • •

"అలా అంకురార్పణ జరిగింది. గుంపులో కొందర్ని త్రోవ కాసి పట్వారీల మనుషులు చితక బాదారు నిశిరాత్రి. వాళ్ళతో పాటు అన్నెం పున్నెం ఎరుగని ఒక కాలేజీ కుర్రాడు బలంగా గాయపడి చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు ఆస్పత్రిలో. ఎవరో రైలెక్కించి ఇంటి ముఖం పట్టిన ఆ కుర్రాడిని కూడా రౌడీలు అమానుషంగా హింసించడంతో ఉద్యమం మరో మలుపు తిరిగింది అకస్మాత్తుగా—"

వెంకట్రామయ్య శ్రద్ధగా వింటున్నాడు.

"ఆ కుర్రాడిపట్ల సానుభూతిని, పట్వారీలపట్ల నిరసననూ తెలియచేస్తూ విద్యార్థులు వూరేగింపు చేశారు ఆ మర్నాటి సాయంత్రం. అతి శాంతి యుతంగా ప్రారంభమైన వూరేగింపు కూడా రక్తప్రవాహంతో ముగియాల్సి వచ్చింది."

"ఎలా?"

"పట్వారీ టవున్‌షిప్‌లో వూరేగింపు ముగిసింది. విద్యార్థులు ఇళ్ళ ముఖాలు పడుతున్నంతలో కరెంట్ ఫెయిల్ అయింది చిత్రంగా. చీకటి రాత్రులు. రాక్షసత్వం మేల్కొంది. ఎవరు ఎవర్ని కొడుతున్నారో తెలియదు. తప్పించుకుందామన్నా త్రొక్కిసలాట. పరిస్థితి గందరగోళమయింది. తిరిగి లైట్లు వెలిగే సరికి నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డట్టు తేలింది."

"తర్వాత—?"

"విద్యార్థులు ముసుగులో గుండాలు విజృంభించారు. పట్వారీల షిఫ్ట్ బస్సు తగల బెట్టారు. ఫాక్టరీలకు నిప్పంటిద్దామని ప్రయత్నించారు. కొన్ని ఇళ్ళలో దూరి అమానుషంగా ప్రవర్తించారు. ప్రభుత్వం కల్పించుకుని పోలీస్ దళాల ద్వారా ఉద్యమం అణచివేయ డాన్ని ప్రయత్నించే కొద్దీ పరిస్థితి మరింత దిగజారింది. తదనంతరం పట్వారీల

## స్వాతంత్ర్య మాస పూర్ణిమ

వస్తుంది ఏటేటా ఆగస్టు పదిహేను
వచ్చినప్పుడల్లా పులకిస్తుంది నా మేను
మనం బానిసలం కామని చెబుతుంది మన జెండా
మధుర కవిత ప్రవహిస్తుంది హృదయంగుండా
వసంత ఋతువు ప్రవేశించిన నందనవని
స్వతంత్రతా సుమ సుందర భారతావని
ప్రజలు పరిపాలించుకుంటున్నారు తమను తాము
ప్రజలను కాదని మనం ఏమీ చేయలేము
తిరుగుతోంది జాతి పతాకంపై ధర్మచక్రం
భరతజాతి ప్రజల పరాక్రమం అవక్రం
గంగమ్మ కొంగుచాటున పాలు తాగే బాలలు
గోదావరమ్మ లోగిలిలో ఆడుకునే బేలలు
ఉత్తర దక్షిణాలు, తూర్పు పడమరలు లేవు
ఎత్తైన పర్వతాలు, లోతైన సాగరాలు అడ్డుకావు
నా తల్లి భారతికి నతులే నా కావ్యాలు
భూత, భవిష్యత్, వర్తమానాలకు లొంగవు,
అతి నవ్యాలు
స్వాతంత్ర్య మాసం వచ్చింది మనకోసం
పదిహేనవ తేదీ తెచ్చింది సంతోషం
నరాలలో ప్రవహిస్తుంది స్వాతంత్ర్య రుధిరం
భరతజాతీయుల చరిత్ర మధురాతి మధురం.

-డాక్టర్ దాశరథి

ఫ్యాక్టరీలు లాకౌట్లు ప్రకటించాయి. ఇదిగో, ఇప్పుడీ సమ్మె!"

వెంకట్రామయ్యగారు మరో ప్రశ్న అడక్కుండా దిగ్గున లేచి నిలుచున్నారు. కణతలు ప్రజ్వలిస్తున్నట్లనిపించింది.

పలసరాల్లోనూ ఆగ్రహపు హోరు.

దిగ్గున లేచి రోడ్డెక్కారు.

యాంత్రికంగా నడుస్తున్న వెంకట్రామయ్యగారి మెదడులో ప్రళయఘోష.

• • •

దేశం తగలబడిపోతూంది.

ధర్మచ్యుతి దారి చేసుకుంటూంది.

మనుషులు జంతుజాలం కన్నా క్షుద్రంగా కుమ్ములాడుకుంటున్నారు.

వినాశనం చేరువవుతూంది.

దీన్ని ఆపాలంటే మరో మహాత్ముడు ఆవిర్భవించాలి.

భాషాప్రాతిపదికనో పరిపాలనా సౌలభ్యం కోసం మనిషి గీసుకున్న సరిహద్దు రేఖలు విషాన్ని క్రక్కుతున్నాయి.

ఆ మంటల వేడిమికి చరాచర ప్రపంచం భస్మీకృత మవుతూంది.

ఈ రేఖల్ని తుడిచి వాటి మూలాన విచ్ఛిన్నమవుతున్న దేశ సౌభాగ్యాన్ని పునరుద్ధరించే మహానుభావుడు ఎక్కడున్నాడు?

• • •

ఆలోచనల్లో పడి వెంకట్రామయ్యగారు చాలా దూరం వచ్చేశారు.

నాలుగు రోడ్ల కూడలిలో చెవులు హోరెత్తించే ఘోషతో అతనికి తెలివి వచ్చింది అకస్మాత్తుగా.

తన ఎదురుగా —

వీరావేశంతో వూగిపోతున్న జనం

కొందరి చేతుల్లో ప్లకార్డ్స్, బేనర్లు.

మరి కొందరి చేతుల్లో రాడ్స్, కర్లు.

కేకలు వేస్తూ, నినాదాలు చేస్తూ ప్రళయ రుద్రుల్లా కనిపిస్తున్నారు.

వెంకట్రామయ్యగారు గుంపుకి సమీపంగా వచ్చేశారు దాదాపు.

ఎదురుగా కనిపిస్తున్న పట్వారీ సినీ థియేటర్ ముందు గుమికూడిన జనానికి పూనకం పట్టింది.

థియేటర్ని కాపాడుతూ స్పెషల్ పోలీస్ దళాలు బారులు తీర్చి. జనం ఒక్కడుగు ముందుకేశారు థియేటర్ కేసి.

పోలీసులు వాళ్ళని వెనకకు పొమ్మని హెచ్చరికలు చేస్తున్నారు.

హెచ్చరికలు పెడ చెవిని పెట్టి జనం మరో అడుగు ముందుకేశారు.

ఇంతలో ఎక్కడి నుంచో రివ్వున గాలిలో ఎగురుకుంటూ వచ్చిన మెట్లంగిరాయి ఒక పోలీస్ చెంపని తాకింది బలంగా.

చర్మం చిట్లి రక్తం స్రవించింది ధారగా.

రక్తాన్ని చూస్తూనే పోలీసుల్లో సంచలనం కలిగింది.

కందిరీగల తుట్ట కదిలింది.

క్షణంలో పరిస్థితి అస్తవ్యస్తమయింది.

పోలీసుల లాఠీలు గాలిలో తేలియాడుతూ విన్యాసం చేస్తున్నాయి. జనంలో ఆక్రందనలు ఆర్తనాదాలు

చెల్లా చెదురుగా పరుగెడుతున్న గుంపు.

వెను తిరిగిన గుంపు మీద లాఠీ ప్రయోగం చేస్తూ వెంటబడిన పోలీసులు.

వెంకట్రామయ్యగారు తప్పించుకుందామన్నా వీల్లేకపోయింది.

అతన్ని తోసుకుంటూ జనం పరిగెడుతున్నారు.

ఆ తోపులో ఆయన క్రిందపడ్డారు.

లేద్దామని ప్రయత్నించేలోగా అతని కాళ్ళని త్రొక్కుతూ జనం పరుగు ఎముక విరిగినట్లు కలుక్కుమంది.

ముసలితనం వెక్కిరిస్తూంది.

కదలలేని తన అశక్తత మీద కోపం వస్తూంది. జాలి వేస్తూంది.

కళ్ళలో నీళ్ళూరాయి.

ప్రాణం గిజగిజ లాడుతూంది బాధతో.

రెండు నిముషాల్లోనే పోలీసులు, జనం అంతా దూరమయ్యారు. కదన భూమిలో క్షతగాత్రుడిలా ఆయనొక్కరే మిగిలారక్కడ.

మరోసారి లేద్దామని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

కాలు స్వాధీనంలో లేదు.

కళ్ళజోడు కూడా ఎక్కడో పడిపోయిం దీ గందరగోళంలో!

కళ్ళముందు చీకటి తెరలు దిగుతున్నాయి.

గుండె బలహీనంగా కొట్టుకుంటూంది.

నాలుక పిడచకట్టుకపోయింది విపరీతమైన దాహంతో.

బాధతో అటూ ఇటూ దొర్లుతూ ...

డీలా పడుతున్నా రాయన. కొద్ది సేపటికి స్పృహ తప్పింది.

• • •

మొహంమీద ఎవరో నీళ్ళు చల్లినట్టు, కనురెప్పలు మృదువుగా స్పృశిస్తున్నట్టు అనిపించింది. కళ్ళు తెరచిన వెంకట్రామయ్య గారి ఎదురుగా ఆయిదేళ్ళ కుర్రాడు కనిపించాడు తన మొహంలోకి జాలిగా చూస్తూ.

తన చేతుల్లో గ్లాసుని ఆయన పెదాలకందించాడు. రెండు గుక్కలు వేయడంతో ప్రాణం లేచివచ్చినట్టయింది.

కృతజ్ఞతతో చూస్తున్నా రా పిల్లాడిని.

ఆ చిన్న కుర్రాడు తన లేతచేతుల్ని ఆయన కందిస్తున్నాడు ఆసరాగా.

ఆ క్షణంలో.

వెంకట్రామయ్యకి ఆ కుర్రాడిలో భాస్కరం కనిపించలేదు, చిట్టిగాడు కన్పించలేదు, ప్రకాశం కనిపించలేదు ఏ భస్మాసుర వారసుడూ కనిపించలేదు.

కల్మషం లేని జాలి చూపులతో తనను లేవదీస్తున్న ఆ కుర్రాడిలో భగవంతుని వారసుడు కనిపించాడు.

రేపటి సమాజాన్ని సరిదిద్దగలిగే మరో మహాత్ముడు కనిపించాడు. *


చిరకాలము నిలిచియుండు
పరిమళముతో మరియు
రోజంతా తాజాగా ఉండుటకు
"రంభ" మరికొళందు అత్తరు
మరియు అగ్గరి టాల్క్




50 గ్రాముల మరికొళందు అగ్గరి టాల్క్
విలర ధర రు 2-60 కి మించదు. సాబిక పన్నులు అదనం




4 Ml షీష్పి. విల్లర ధర
రు. 7-50 కు మించదు

మరికొళందు చిన్నసైజు రు. 1-30
మరికొళందు పెద్దసైజు రు. 5-25
స్థానిక పన్నులు అదనము
ఇంకను 32 ఇతర రకముల అత్తరుల కూడ తయారు చేయుచున్నాము.
ఉత్పత్తిదార్లు :
మెస్సర్స్. రంభ కాస్మెటిక్స్
అడయార్, మద్రాసు.600 020.

ఆంధ్రప్రదేశ్ మరియు ఒరిస్సాకు ఏజంట్లు
మెస్సర్స్. నరేంద్ర ఏజన్సీస్
...గారం, విజయవాడ—520 002